పంటకు చుక్క.. ఆదాయం ఎంచక్కా

- బిందు సేద్యం వైపు రైతుల మొగ్గు
- జిల్లాలో 10 వేల హెక్టార్లకు డ్రిప్పు సరఫరా
- మడకశిరలో 7544.5 హెక్టార్లకుపైగా వాణిజ్య పంటల సాగు
- 90 శాతం సబ్సిడీతో డ్రిప్పు పరికరాలు అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం


టీడీ పల్లిలో బిందు సేద్యం ద్వారా సాగు చేసిన వక్కతోట


టీడీ పల్లిలో అత్యాధునిక హైడ్రోసైక్లోన్ ఫిల్టర్‌ను బిగిస్తున్న దృశ్యం

రొళ్ల: మడకశిర నియోజకవర్గ వ్యాప్తంగా వాణిజ్య పంటల సాగుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. మరీ ముఖ్యంగా తక్కువ నీటి వసతి కలిగిన రైతులు ప్రభుత్వం సబ్సిడీతో అందజేస్తున్న బిందు సేద్యం పరికరాలను సద్వినియోగం చేసుకుని పంటలు సాగు చేస్తూ అధిక లాభాలు పొందుతున్నారు.

ఉద్యానవన పంటలదే అగ్రస్థానం

మడకశిర నియోజకవర్గంలోని రొళ్ల, అగళి, గుడిబండ, అమరాపురం, మడకశిర మండలాల్లో నీటి వసతి కలిగిన రైతులు అరటి, మామిడి, సపోట, దానిమ్మతో పాటు వక్క, బొప్పాయి, మల్బరీ సాగు చేస్తున్నారు. అలాగే పూలు, కూరగాయల పంటను సాగు చేసి అతి తక్కువ సమయంలోనే ఎక్కువ లాభాలు పొందుతున్నారు. నియోజకవర్గం వ్యాప్తంగా సుమారు 7544.5 హెక్టార్లకు పైగా వాణిజ్య పంటలు సాగు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. గత ఏడాది ఆగస్టు చివరి వారం నుంచి సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో వర్షాలు సమృద్ధిగా కురవడంతో చెరువులు, కుంటలు నీటితో నిండి భూగర్భ జలాలు పెరిగాయి. దీంతో ఎక్కువ మంది రైతులు బోరుబావుల కింద వివిధ రకాల వాణిజ్య పంటల సాగుకు ఆసక్తి చూపుతున్నారు. కూలీలకు ఏడాది పొడవునా స్థానికంగానే ఉపాధి లభిస్తుండటతో కుటుంబాలను ఆర్థికంగా అభివృద్ధి చేసుకుంటున్నారు.

మార్కెట్ సౌకర్యం కల్పిస్తే...

నియోజకవర్గం వ్యాప్తంగా వాణిజ్య పంటలు సాగు చేసిన రైతులకు స్థానికంగా మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. కర్ణాటక ప్రాంతాలకు ఎక్కువగా సరుకు సరఫరా చేస్తుండటంతో రవాణా చార్జీలు ఎక్కువయ్యాయని, స్థానికంగా మార్కెట్ సౌకర్యం కల్పిస్తే మరింత అనుకూలంగా మారుతుందని రైతులు చెబుతున్నారు. సంబంధితశాఖ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలన్నారు.

90 శాతం సబ్సిడీతో డిప్పు పరికరాలు

రాష్ట్ర ప్రభుత్వం ఐదెకరాల్లోపు భూములు కలిగిన రైతులకు 90 శాతం సబ్సిడీతో డిప్పు పరికరాలు అందిస్తోంది. మిగిలిన 10 శాతాన్ని రైతు వాట కింద కట్టుకోవాల్సి ఉంటుంది. నీటి వసతి తక్కువ ఉన్న రైతులు ఎక్కువ శాతం డ్రిప్పు పద్ధతిలో వాణిజ్య పంటలు సాగు చేయడానికి శ్రీకారం చుట్టారు. మామూలుగా ఎకరాకు కట్టే నీళ్ల డ్రిప్పు పద్ధతిలో రెండు నుంచి మూడెకరాల వరకు పెట్టుకోవచ్చు. అర్హత ఉన్న ప్రతి రైతు దరఖాస్తులు చేసుకున్న నెల రోజుల్లోపే డ్రిప్పు పరికరాలను అందిస్తున్నారు. దీంతో ఎక్కువ మంది డ్రిప్పు పద్ధతి ద్వారా సాగు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు.

10 వేల హెక్టార్లకు అనుమతి

జిల్లాలో 2022-23లో 10 వేల హెక్టార్లకు ఏపీఎంఐపీ డ్రిప్పు పరికరాలు అందించింది. అలాగే 2023-24 గాను మరో 10 వేల హెక్టర్లకు ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చింది. అందులో ప్రస్తుతం 185 హెక్టర్లలో డ్రిప్పు పరికరాల పంపిణీ చేయనున్నారు. సబ్సిడీపోను మిగిలిన మొత్తాన్ని రైతులు చెల్లించాల్సి ఉంది. డ్రిప్పు పరికరాలు అందించడం కోసం 26 కంపెనీలకుపైగా సిద్ధంగా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

వాణిజ్య పంటల వివరాలు (హెక్టార్లలో..)

మండలం	మామిడి	దానిమ్మ	వక్క	పూలతోటలు	కూరగాయలు	హెక్టార్లు
మడకశిర	1039	399	85	145	288	1956
రొళ్ల	156	550	381	225	115	1426
గుడిబండ	296	265	260	71	230	1122
అమరాపురం	135	295	950	10	170	1560
అగళి	275	180	385	360	280	1480

ఆదాయం బాగుంది



ఏటా వేరుశనగ, వరి, రాగి పంటలు సాగు చేసి తీవ్రంగా నష్టాలు చవిచూసేవాళ్లం. పదేళ్లుగా మూడు ఎకరాల్లో వక్క పంట సాగు చేసి లాభం పొందుతున్నాం. గతేడాది వర్షాలు సమృద్ధిగా కురవడంతో బిందు సేద్యం ద్వారా పంట సాగు చేస్తున్నాం. ఖర్చులు పోగా ప్రతి పంటకు రూ.5 లక్షల వరకూ ఆదాయం వస్తోంది.

– నారాయణప్ప, రైతు, టీడీ పల్లి

బిందు సేద్యమే మేలు



నాకున్న 2.5 ఎకరాల విస్తీర్ణంలో బిందు సేద్యం సహాయంతో కొత్తగా వక్క తోటను సాగు చేశాను. బిందు సేద్యం ద్వారా సాగు చేయడం వల్ల నీళ్లు కూడా ఆదా అయ్యాయి. దీనికి తోడు వేరుశనగ, రాగి, వరి వంటి పంటలు కూడా సాగు చేస్తున్నాం. అధికారులు మార్కెట్ సౌకర్యం కల్పిస్తే మాకు మరింత లబ్ధి చేకూరుతుంది.

– గంగమ్మ, మహిళా రైతు, బంద్రేపల్లి

అర్హులందరికీ డ్రిప్పు



అర్హత ఉన్న ప్రతి రైతుకూ డ్రిప్పు పరికరాలు అందిస్తాం. ఐదెకరాల్లోపు భూములు కలిగిన రైతులకు 90 శాతం కింద, ఐదెకరాల పైబడి వారికి 70 శాతం, పదెకరాలపై ఉన్న రైతులకు 50 శాతం సబ్సిడీతో డ్రిప్పు పరికరాలు మంజూరు చేస్తున్నాం. ఆసక్తి గల రైతులు ఆర్‌బీకేలను సంప్రదిస్తే నెల రోజుల్లోపే డిప్పు పరికరాలు అందజేస్తాం.

– సుదర్శన్, ఏపీఎంఐపీ, ప్రాజెక్ట్ డైరెక్టర్

క్లుప్తంగా

పెద్దిపల్లి రోడ్డుకు మరమ్మతు


పెద్దిపల్లి రోడ్డుకు మరమ్మతు చేస్తున్న దృశ్యం

రొద్దం: మండలంలోని పెద్దిపల్లికి వెళ్లే ప్రధాన రహదారిపై గుంతలు పడటంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ సర్పంచ్ పరమేశ్వరయ్య, ఎంపీటీసీ శంకర్‌రెడ్డి తదితరులు సమస్యను ఎమ్మెల్యే శంకర నారాయణ దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే గ్రామానికి రెండు కిలో మీటర్లు తాత్కాలిక మట్టి రోడ్డు వేయడానికి సహకారం అందించారు. జేసీబీ, ట్రాక్టర్లు ఏర్పాటు చేసి రోడ్డుకు మట్టి తరలించి రోలింగ్ చేయిస్తుండటంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

నేడు పరిగిలో డివిజన్‌స్థాయి 'స్పందన'

పరిగి: మండల కేంద్రంలో నేడు డివిజన్‌స్థాయి స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సౌజన్యలక్ష్మీ తెలిపారు. పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్ ఆధ్వర్యంలో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకూ స్పందన కార్యక్రమం ఉంటుందన్నారు. డివిజనల్ స్థాయిలో పని చేస్తున్న ప్రభుత్వ అధికారులతో పాటూ మండలస్థాయి అధికారులంతా ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రజలకు సేవలందించడం అధికారుల బాధ్యత



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న లోకాయుక్త అధికారి ఫణీంద్ర

పావగడ: ప్రజలకు మెరుగైన సేవలందించడం అధికారుల బాధ్యత, నిర్లక్ష్యం వహిస్తే తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని లోకాయుక్త అధికారి ఫణీంద్ర హెచ్చరించారు. స్థానిక ప్రభుత్వ మోడల్ ఉన్నత పాఠశాలలో రామకృష్ణ ఆశ్రమం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన నోటు పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా 500 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు అందించారు. రామకృష్ణాశ్రమాధిపతి స్వామి జపానంద మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి పరచే దిశగా ప్రభుత్వం అడుగు లేయాలని సూచించారు.

కొడిగెనహళ్లిలో వరుస చోరీలు


పరిగి: మండలంలోని కొడిగెనహళ్లిలో శనివారం రాత్రి వరుస చోరీలు జరిగాయి. స్థానిక కోళ్లఫారం సమీపంలో ఉంటున్న గంగాధరప్ప అనే వ్యక్తి ఇంట్లో చొరబడిన దొంగలు బీరువా తాళాలను పగలగొట్టి రూ.5 వేల నగదుతో పాటు బంగారు ఆభరణాలను దొంగిలించారని ఎస్‌ఐ నరేంద్ర తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. అలాగే అదే గ్రామానికి చెందిన మరో రెండు ఇళ్లలో కూడా దొంగతనం జరిగింది. అయితే కొన్ని వెండి ఆభరణాలు మాత్రమే దొంగలు తస్కరించినట్లు తెలిసింది. వీటిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ నరేంద్ర తెలిపారు.

విద్యా సామగ్రి పంపిణీ


మహిళలకు తులసి మొక్కలు అందజేస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: అనఘా దత్త ట్రస్ట్ ఆధ్వర్యంలో అనాథ పిల్లలకు విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. అనఘాదేవి వ్రతాన్ని పురస్కరించుకుని ఆదివారం స్థానిక ఆర్‌పీజీటీ రోడ్డులోని అనఘా దత్త ట్రస్ట్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణకు తులసి మొక్కలు, అలాగే విద్యార్థులకు పెన్నులు, నోటు పుస్తకాలు, పలకలను అందజేశారు. కార్యక్రమంలో ఆ ట్రస్ట్ చైర్మన్ విశ్వేశ్వరయ్య, మహిళలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం


బోరు బావి నుంచి వస్తున్న నీరు

అమరాపురం: మండలంలోని పాత శివరం గ్రామ ప్రజల తాగునీటి సమస్య తీరింది. గత నెల 28న గ్రామంలో ఎమ్మెల్యే తిప్పేస్వామి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు తాగు నీటి సమస్య ఉందని పరిష్కరించాలని ఎమ్మెల్యేని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే తిప్పేస్వామి సంబంధిత అధికారులకు తాగు నీటి సమస్య తీర్చాలని సూచించారు. ఆదివారం ఎంపీపీ ఈరన్న ఆధ్వర్యంలో మండల పరిషత్ నిధుల నుంచి బోరు బావి తవ్వకానికి పూజలు చేశారు. రెండు ఇంచుల నీళ్లు పడటంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి


హిందూపురం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపికను అభినందిస్తున్న రాష్ట్ర కురబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్

హిందూపురం: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కష్టపడిచేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా చూసుకుందామని రాష్ట్ర కురబ కార్పొరేషన్ చైర్మన్‌ కోటి సూర్యప్రకాష్ అన్నారు. ఆదివారం హిందూపురం సమన్వయకర్త దీపికను కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

మసీదును ప్రారంభించిన ఎమ్మెల్యే


మసీదు ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే శంకరనారాయణ

గోరంట్ల: మండల పరిధిలోని జీనంవాడ్లపల్లి సమీపంలోని జగనన్న కాలనీలో మసీదు నిర్మాణానికి ప్రభుత్వం స్థలం కేటాయించింది. దాత సహకారంతో ముస్లిం సోదరులు నూతన మసీద్‌ను నిర్మించారు. ఇందులో భాగంగానే ఆదివారం ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర నారాయణ నూతన మసీదును మత పెద్దలతో కలసి ప్రారంభించారు. అంతకు ముందు మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. నూతన మసీదుకు మత పెద్దలు జామియా ఫాతిమ మసీదుగా నామకరణ చేశారు. కార్యక్రమంలో జిల్లా సహకార బ్యాంకు డైరెక్టర్ పాటూరి శంకరరెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ ఫక్రుద్దీన్ సాహెబ్, జిల్లా పరిషత్ కోఆప్షన్ మెంబర్ డాక్టర్ బాషా, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, టౌన్ కన్వీనర్ దనుంజయరెడ్డి, మైనార్టీ నాయకులు హిదయతుల్లా, అతావుల్లా, షమీవుల్లా, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

రామామృత మహాప్రసాదం ఊరేగింపు


మహాప్రసాదాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

పావగడ: తాలూకాలోని వైఎన్ హొసకోటలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో రామామృత తరంగిణి ట్రస్ట్ ఆధ్వర్యంలో రామజన్మ భూమి మహాభియాన పూజా కార్యక్రమాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 16 ప్రముఖ నదుల పవిత్రమైన నీరు, మట్టితో తయారు చేసిన మహా ప్రసాదాన్ని గాంధి కూడలి నుంచి కన్యకాపరమేశ్వరి దేవాలయం వరకు ఘనంగా ఊరేగించారు. ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు ఎస్‌ఆర్ అశ్వర్థకుమార్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా సంచరించి కోటికి పైగా ఇళ్ల నుంచి పూజా సంకల్పాలను స్వీకరించి అయోధ్యలో నిర్వహించే మహాయాగానికి ఈ మహా ప్రసాదాన్ని తరలిస్తామన్నారు.

భక్తిశ్రద్ధలతో సప్పలమ్మ రథోత్సవం


అలంకరణలో సప్పలమ్మ

హిందూపురం అర్బన్: హిందూపురం గ్రామీణ మండలం రామచంద్రాపురంలో ఆదివారం గ్రామ దేవత సప్పలమ్మ రథోత్సవం వైభవంగా నిర్వహించారు. గ్రామస్తుల ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ నాయకురాలు చౌళూరు మధుమతిరెడ్డి హాజరయ్యారు. భక్తులు ఉదయం నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి విగ్రహాన్ని రథంపై కొలువుదీర్చి రథోత్సవం నిర్వహించారు. హిందూపురం, చౌళూరు, సంతేబిదనూరు, బేవనహళ్లి నుంచే కాకుండా కర్ణాటక రాష్ట్రం నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఎంపీపీ రామాంజి, సర్పంచి నంజప్ప, ఎంపీటీసీ కృష్ణవేణి, నాగరాజు, లోకేష్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, పవన్‌కుమార్, వాసు తదితరులు రథోత్సవంలో పాల్గొన్నారు.

వైభవంగా రంగనాథస్వామి బ్రహ్మరథోత్సవం


అలంకరణలో కాలువ రంగనాథస్వామి


రథాన్ని లాగుతున్న భక్తులు

రొళ్ల: మండల పరిధిలోని కె.బ్యాడగెర గ్రామ సమీపాన వెలసిన కాలువ రంగనాథస్వామి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం బ్రహ్మరథోత్సవం కనుల పండువగా జరిగింది. స్వామివారి మూల విగ్రహాన్ని వెండి, బంగారు ఆభరణాలతో పాటు వివిధ రకాల పూలతో విశేష అలంకరణ చేశారు. ముందుగా వేద పండితులు మంత్రోచ్ఛరణ నడుమ హోమం, గణపతి పూజా, దేవనాంది, అంకురార్పణ, అభిషేకం తదితర పూజలు చేసి మహామంగళారతి ఇచ్చారు. అనంతరం వేదపండితులు బ్రహ్మరథం ముందు శాంతి హోమం, బలిహరణ పూజలు చేశారు. రథాన్ని పూలతో చూడముచ్చటగ ప్రత్యేకంగా అలంకరించారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో ఉత్సవ విగ్రహాన్ని ఆలయం నుంచి సమీపాన ఉన్న రథం వద్దకు తీసుకువచ్చి రథంలో కూర్చోబెట్టారు. తర్వాత ఉత్సవానికి హాజరైన అశేష భక్తుల నడుమ గోవింద నామస్మరణతో మధ్య ఆలయం నుంచి రథాన్ని భక్తులు లాగారు. ఈ సందర్భంగా రథంపైకి తమలపాకు, బొరుగులు, అరటి పండ్లు, పూలు ఇతరాత్ర వాటిని విసిరి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవానికి వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారితో పాటు చుట్టు పక్కల గ్రామాలు, సమీప కర్ణాటక ప్రాంతం నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ ద్వారా అన్నదానం చేశారు. ఉత్సవంలో కె.బ్యాడగెర, కాకి గ్రామానికి చెందిన ముఖ్యమైన గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉత్సవ విగ్రహం ఊరేగింపు

రొళ్ల మండలం కె.బ్యాడగెర గ్రామ సమీపాన వెలసిన కాలువ రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం చుట్టు పక్కల గ్రామాల్లో ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

16న బోయల ఆత్మీయ సమ్మేళనం

పుట్టపర్తి టౌన్: పుట్టపర్తి పట్టణంలో శిల్పారామంలో ఈనెల 16న వాల్మీకి, బోయ సంఘం ఆధ్వర్యంలో బోయల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం నాయకులు తెలిపారు. ఆదివారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బోయలను ఎస్టీ జాబితాలో చేర్చడం, తదితర అంశాలపై సూచనలు సలహాలు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లాలో ఉన్న వాల్మీకులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర సలహాదారు ఈశ్వర్, జిల్లా అధ్యక్షుడు బోయ సాంబ, నాయకులు మోహన్, దనుంజయ, కేశవ తదితరులు పాల్గొన్నారు.

సిద్ధేశ్వరస్వామికి పూజలు

అమరాపురం: మండల పరిధిలోని హేమావతిలో వెలసిన ప్రసిద్ధ శైవక్షేత్రం సిద్ధేశ్వరస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆదివారం ఉదయం స్వామికి సుప్రభాతసేవ, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం తదితర పూజలు చేశారు. అనంతరం భక్తులు తెచ్చిన వివిధ పూలతో స్వామిని ప్రత్యేకంగా అలంకరించి మహా మంగళ హారతి ఇచ్చారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

దంపతులపై దాడి

హిందూపురం అర్బన్: హిందూపురం మండలం సంతేబిదనూరుకు చెందిన హనుమంతప్ప, అతని భార్య గంగరత్నపై దాడి జరిగింది. స్థానికుల వివరాలమేరకు.. సంతేబిదనూరుకు చెందిన మంజు అనే వ్యక్తి మద్యం అమ్మకం చేస్తున్నాడు.. అంటూ రెండురోజుల క్రితం హనుమంతప్ప పోలీసులకు సమాచారం ఇచ్చారన్న మంజు అనుమానించాడు. ఈ నేపథ్యంలోనే ఆదివారం రాత్రి మంజునాథ్, మరో ఇద్దరు హనుమంతప్ప ఇంటికి వెళ్లి హనుమంతప్పతో పాటు అతని భార్య గంగరత్నను కొట్టడంతో గాయాలపాలయ్యారు. చికిత్స నిమిత్తం వారిని హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఏఎస్‌ఐ సురేష్ ఆస్పత్రికి చేరుకొని జరిగిన సంఘటనపై వివరాలు సేకరించారు.

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

అమరాపురం: మండల కేంద్రమైన అమరాపురం గ్రామ సచివాలయం 1 పరిధిలోని వీధుల్లో సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మునిస్వామి, ఎంపీపీ ఈరన్న తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే తిప్పేస్వామి హాజరవుతారన్నారు. మండలస్థాయి అధికారులు, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు, గృహ సారథులు, జేసీఎస్ కన్వీనర్, సచివాలయం కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు, వివిధ కార్పొరేషన్ డైరెక్టర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి రావాలని వారు కోరారు. సోమవారం ఉదయం 8 గంటలకు స్థానిక బస్టాండు నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

అవినీతి చక్రవర్తి గుండుమల


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అగళి: ఎమ్మెల్యే తిప్పేస్వామిపై మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకులు హితవు పలికారు. ఆదివారం పట్టణంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మహేంద్రప్ప నివాసంలో మహేంద్రప్పతో పాటు నాయకులు కామరాజు, సతీష్, నాటరాజు, హనుమంతరాయప్ప, చంద్రప్ప, బసవారాజు, కో ఆప్షన్ మెంబర్ నాసిర్ మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అక్రమలు జరిగాయని ఆరోపణలు చేస్తున్నారని ఇందులో ఏ మాత్రం వాస్తవం లేదన్నారు. టీడీపీ ప్రభుత్వంలో అనేక అవినీతి కార్యకలాపాలకు పాల్పడింది ఆ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులేనని విమర్శించారు. గుండుమల తిప్పేస్వామి అవినీతి చక్రవర్తని మండిపడ్డారు. టీడీపీ కండువా వేసుకుంటేనే పెండింగ్ బిల్లులతో పాటు ఇతర పథకాలు కూడా వర్తింపజేస్తామని బెదిరింపులకు పాల్పడేవారన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో కుల, మత , పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను వర్తింపజేస్తున్నామని చెప్పారు.

ఘనంగా గిరి ప్రదర్శన


అలంకరణలో గుడ్డం రంగనాథస్వామి

హిందూపురం: పట్టణంలోని గుడ్డం రంగనాథ స్వామి ఆలయ గిరిప్రదర్శన ఆదివారం ఘనంగా జరిగింది. రంగనాథస్వామి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామి ఉత్సవమూర్తులను పూలరథంలో కొలువుదీర్చి పూజలు చేసి భక్తులు గోవింద నామస్మరణ చేస్తూ గిరి ప్రదర్శన చేశారు. అనంతరం మంగళ హారతులిచ్చి తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ నాగేంద్ర, అర్చకులు గోవిందశర్మ, కమిటీ సభ్యులు నరసింహులు, భక్తులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచుకు పరామర్శ


కృష్ణమూర్తిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర: మాజీ సర్పంచు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎన్ కృష్ణమూర్తిని ఆదివారం సాయంకాలం ఎమ్మెల్యే తిప్పేస్వామి పరామర్శించారు. ఇటీవల కృష్ణమూర్తి ద్విచక్ర వాహనం నుంచి పడి గాయపడ్డారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే నేరుగా కృష్ణమూర్తి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్యం కుదుటపడే వరకు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు జయరాజు, అంజన్‌కుమార్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

వైభవంగా దిండి ఉత్సవం

పావగడ: స్థానిక భావసార క్షత్రియ సామాజిక వర్గం ఆరాధ్య దైవమైన విఠల రుఖుమాయి 35వ దిండి ఉత్సవాన్ని స్థానిక ఆంజనేయస్వామి కల్యాణ మంటపంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. వెండి రథంపై రుఖుమాయి విగ్రహాన్ని కొలువుదీర్చి భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. కార్యక్రమంలో స్థానిక భావసార క్షత్రియ సంఘం అధ్యక్షుడు సురేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.